సమాచారం

విద్యార్థులకు చేయూత

రసూల్‌పురా: వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మూడో వార్డులోని మడ్‌ఫోర్ట్, కార్ఖాన ప్రభుత్వ పాఠశాల, బోయిన్‌పల్లి బాలుర, బాలికల పాఠశాలల్లో అరిగె రామస్వామి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అరిగె మధుసూదన్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గౌరిశెట్టి మునిందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెంచీలు, క్రీడా పరికరాలు, పౌష్టికాహారం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆశీర్వాదం, సంతోషీ, ఉపధ్యాయులు షెడ్రిక్, స్థానికులు షకీబ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా


రసూల్‌పురా: రెండవ వార్డు నుంచి తనకు అవకాశమిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని బీఆర్ఎస్ నాయకులు మార్కెట్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రెండవ వార్డు పరిధిలోని నారాయణ జోపిడి సంఘం, రామాలయం వీధి, 105 గల్లీ తదితర బస్తీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గత పదేళ్లుగా పదవి లేకుండా ప్రజలతో మమేకమవుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్న సహకారంతో అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశానన్నారు. షేక్ నయిం, కుమార్, నర్సింహ, శ్యామ్‌రెడ్డి, నాగేష్, మహేష్, క్రిష్ణ, శ్రీను, స్వామి, గౌస్, యూసూప్, రాము, జగన్, రవి పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లోని లాల్ బహదూర్ కమ్యూనిటీ హాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. మోతె శోభన్‌రెడ్డి, జింకల మల్లేష్, వెంకటేష్, నాగేశ్వర్, శ్యామ్, హరి,గండికోట ఆనందం, కాజా పాషా, యాకూబ్, నట్రాజ్, హుస్సేన్ పాల్గొన్నారు.

వయోధికులు.. నవయువకులు





క్రీడాంశాల్లో విజేతలకు బహుమతులు అందజేసిన అతిథులతో మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ సభ్యులు (ఫైల్)

సనత్‌నగర్: అనుభవంలో నుంచి పుట్టుకొచ్చిన 'తల పండిన' ఆలోచనలు అక్కడ నిత్యం మెదులుతుంటాయి. నేటి తరం మార్గదర్శకానికి వ్యూహ రచనలు సాగుతుంటాయి. తాముండే కాలనీకి అవసరమైన వసతుల కల్పనకు ప్రణాళికలు ఊపిరిపోసుకుంటాయి. సేవకు పునాదులు పడతాయి. అంతేనా... వయసుకే వృద్ధాప్యమేమో.. మనస్సుకు మాత్రం కాదన్నట్లు హుషారైన వాతావరణం అక్కడి వారి సొంతం. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయం. సీనియర్ సిటిజన్స్ ఆనందానికి నెలవైంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీకి చెందిన సీనియర్ సిటిజన్స్ అంతా ఒకచోట చేరి సందడిగా గడుపుతున్నారు.



చదరంగం ఆడుతూ..

ఆటలతో ఉల్లాసంగా...ఉత్సాహంగా...

వయస్సు మీద పడింది కదా అని ఏదో మూలన కూర్చోవడం ఒకప్పటి మాట. ఇక్కడ సీనియర్ సిటిజన్స్ మాత్రం ఆటలతో అదరగొట్టేస్తున్నారు. క్యారమ్స్, చెస్ వంటి గేమ్స్‌తో మానసికోల్లాసం పొందడమే కాకుండా ట్రెడ్‌మిల్‌పై సాధన చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారు. చాలా కుటుంబాల్లో తమ వారంతా కార్యాలయాలు, ఉద్యోగాలు, వివిధ పనుల నిమిత్తం వెళ్లిపోతుండగా సీనియర్ సిటిజన్స్ ఇక్కడికి వచ్చి ఎవరికిష్టమైన గేమ్‌లో వారు ఆడుతూ ఒంటరితనాన్ని దూరం చేసుకుంటున్నారు. దాదాపుగా రెండు వేల పుస్తకాలతో లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నారు. కాలనీవాసులు ఇంటికి తీసుకువెళ్లేందుకు కూడా అనుమతిస్తారు. అలాగే దినపత్రికలు, మ్యాగజైన్స్ చదువుతూ కొత్త విశేషాలను తెలుసుకుంటుంటారు. ప్రతిరోజూ ఇక్కడికి నాలుగు రకాల పత్రికలతో పాటు వివిధ రకాల వీక్లీ మ్యాగజైన్స్ వస్తుంటాయి.

తోటి డేకేర్ సెంటర్లకు సహకరిస్తూ..

కొంతమందితో ప్రారంభమైన ఇక్కడి అసోసియేషన్ కార్యకలాపాలు ఎన్నో కాలనీలకు చెందిన వయోధికులను ప్రభావితం చేసి దిక్సూచిగా నిలిచింది. మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జీహెచ్ఎంసీ ఆసరా కమిటీలో స్థానం పొందడంతో పాటు జెక్‌కాలనీ, సుందర్‌నగర్, సంజీవరెడ్డినగర్, ఆదిత్యనగర్‌లు సైతం గుర్తింపు పొందేందుకు తమవంతు సహకారాన్ని అసోసియేషన్ అందించింది. జనవరి 26 ఆగస్టు 15 అక్టోబర్ 1 రోజుల్లో ఆసరా కమిటీ సహకారంతో జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్‌లోని సీనియర్ సిటిజన్స్‌కు పలు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తుంటారు. ఏడు పదులు దాటిన వయోధికులకు మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతియేటా సన్మానిస్తూ ఎప్పటికప్పుడు వారిలో నూతనోత్తేజాన్ని నింపుతోంది. దీనికి వారి కుటుంబసభ్యులను కూడా ఆహ్వానించి భవిష్యత్ తరాలకు సీనియర్ సిటిజన్స్‌కు ఏవిధమైన గౌరవం, ఆప్యాయత చూపించాలో కళ్లకు కట్టినట్లు చూపిస్తుండడం విశేషం.





విజ్ఞానాన్ని పంచే లైబ్రరీ.. ట్రెడ్‌మిల్‌పై సాధన చేస్తూ..

ఆత్మాభిమానంతో బతకాలి..



ఏ సమాజంలో వృద్ధులు తల ఎత్తుకుని ఆత్మాభిమానంతో మనుగడ సాగిస్తారో ఆ సమాజమే నాగరిక సమాజం. ఆ సమాజం సర్వోతోముఖంగా అభివృద్ధి చెందుతుంది. అన్ని రంగాల్లో ముందుంజ వేసి భావితరాలకు కరదీపికగా నిలుస్తోంది. ఇది ఒక భావన, ఓ ఆకాంక్ష, ఒక స్వప్నం. దీనిని సాకారం చేసుకోవాలంటే కలలో నుంచి ఇలలోకి రావాలి. నేటి సమాజంలోని వృద్ధుల స్థితిగతులను సామాజిక, శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలి.

– జేఎస్‌టీ శాయి, అసోసియేషన్ అధ్యక్షుడు

రూ. 29.75 కోట్లతో భారీ విద్యాలయ భవనాలు

డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్



భవన కూల్చివేత పనులు పరిశీలిస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో విద్యాలయాల భారీ భవన నిర్మాణ సముదాయం పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ తెలిపారు. భవన సముదాయం నిర్మించనున్న స్థలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పురాతన భవన కూల్చివేత పనులను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థలంలో ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాల కోసం రూ. 29.75 కోట్ల నిధులను మంజూరు చేయించామన్నారు. అధునాతన విద్యా వసతులు ఏర్పాటుతో పాటు విశాలమైన పార్కింగ్, లిఫ్టుల సదుపాయాలను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్పొరేటర్ విద్యా సంస్థలకు దీటుగా విద్యా బోధనలను పేదలకు అందించడం కోసం ఒకే ప్రాంగణంలో పాఠశాల, కళాశాల భవనాలను ఏర్పాటు చేస్తున్నామన్నా రు. అనంతరం తార్నాక డివిజన్‌కు చెందిన పలువురి కి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. దా సోజు శ్రవణ్, కట్టెల శ్రీనివాస్‌యాదవ్, సుంకు రాంచందర్, సెట్విన్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో భార్య మృతి.. భర్తకు గాయాలు



సంధ్యారాణి (ఫైల్)

సికింద్రాబాద్: బంధువు వివాహానికి హాజరయ్యేందుకు నగరానికి వచ్చిన భార్యాభర్తలు రైలు ప్రమాదం బారిన పడి భార్య మృతి చెందగా భర్త చికిత్స పొందుతున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా శాయంపేట్‌కు చెందిన రాచర్ల ప్రభాకర్, సంధ్యారాణి (39) దంపతులు. చర్లపల్లిలో గురువారం రాత్రి జరగాల్సిన మేనకోడలి వివాహానికి హాజరయ్యేందుకు 11 మంది బంధువులతో కలిసి వరంగల్ నుంచి పుష్‌పుల్ రైలులో చర్లపల్లికి సాయంత్రం 6 గంటలకు చేరుకున్నారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు ఆగిన తరువాత ఒకే డోరు నుంచి 11 మంది దిగే ప్రయత్నం చేశారు. చివరన ఉన్న ప్రభాకర్ దంపతులు దిగేలోపు రైలు కదిలింది. తొందరగా దిగాలన్న తపనతో కదులుతున్న రైలు నుంచి దిగుతుండగా ప్రభాకర్ సంధ్యారాణి బోగీకి ప్లాట్‌ఫామ్‌కు మధ్యలో ఇరుక్కుపోయారు. గమనించిన గార్డు సిగ్నల్ చేయడంతో రైలు ఆగిపోయింది. అప్పటికే తీవ్ర గాయాలపాలైన సంధ్యారాణి మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ ప్రభాకర్‌ను ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధికి కట్టుబడి ఉంటా

రసూల్‌పురా: రెండవ వార్డు నుంచి రెండుసార్లు బోర్డు సభ్యుడిగా కొనసాగి కోట్లాది రూపాయల వ్యయంతో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని తాను చేపట్టిన అభివృద్ధిని చూసి మూడో వార్డులో ఈ సారి గెలిపించాలని బోర్డు మాజీ సభ్యులు సదా కేశవరెడ్డి కోరారు. గన్‌బజార్, వల్లభాయ్ పటేల్ నగర్ బస్తీల్లో రెండు షాదీఖానాలు నిర్మించినట్లు తెలిపారు. 3 వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు.

రంజాన్‌కు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ

సనత్‌నగర్: ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా నిర్వహించుకునే రంజాన్ పండుగకు ప్రభుత్వపరంగా అన్ని ఏర్పాట్లు చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మాసాబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో గురువారం హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో రంజాన్ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అన్ని పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేస్తుందని అందులో భాగంగానే ప్రతి సంవత్సరం రంజాన్‌కు ముస్లిం సోదరులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపడతారని అన్ని మసీదుల వద్ద రోడ్ల మరమ్మతులు, పరిసరాల పరిశుభ్రత, లైట్ల ఏర్పాటు వంటి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్, జోనల్ కమిషనర్లు రవికిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ డైరెక్టర్ కృష్ణ, జీఎంలు రమణారెడ్డి, హరిశంకర్, ఈఈలు సుదర్శన్, ఇందిర, ఎలక్ట్రికల్ డీఈఈ శ్రీధర్, సుధీర్, హార్టికల్చర్ డీ డీ శ్రీనివాస్, మహంకాళి, బేగంపేట ఏసీపీలు రమే ష్, పృథ్వీధర్‌రావు, ట్రాఫిక్ ఏసీపీలు జ్ఞానేందర్‌రెడ్డి, గంగారెడ్డి, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలతో పేదల జీవితాలు ఛిన్నాభిన్నం

బన్సీలాల్‌పేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మోటార్ వాహన చట్టాలు వాహనచోదకులు, ప్రజలకు గుదిబండగా మారాయని మంత్రి తలసాని ఆరోపించారు. రాణిగంజ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మినీ గూడ్స్ వెహికల్స్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పేద, మధ్య తరగతి వర్గాల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తోందని మండి పడ్డారు. మినీ గూడ్స్ వెహికల్స్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు. మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్, యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్, జహంగీర్, రాజు, మహేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో సరుకులు పంపిణీ చేయాలి

బౌద్ధనగర్: డివిజన్‌లోని పలు రేషన్ దుకాణాల్లో గురువారం పౌర సరఫరా శాఖ అధికారులు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఏఎస్‌వో సరస్వతి నేతృత్వంలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సకాలంలో నిత్యావసరాలు అందించేందుకు డీలర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: తెలంగాణ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోర్డు మాజీ సభ్యురాలు పి. నళిని కిరణ్ ఆధ్వర్యంలో మర్రి అరుంధతి ఆస్పత్రి సౌజన్యంతో నాలుగో వార్డు గాంధీనగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేదల వైద్యం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. మంత్రి కేటీఆర్ స్ఫూర్తితో 'గిఫ్ట్ ఏ స్మైల్' కింద మర్రి అరుంధతి ఆస్పత్రిలో 2000కు పైగా ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, సీనియర్ నేతలు పెద్దాల నర్సింహ, ముప్పిడి మధుకర్, వినోద్ కుమార్, రాజేంద్ర, ప్రవీణ్ యాదవ్, సురేశ్, ఇస్మాయిల్, నూర్, యాకూబ్, గంగారాం, కిరణ్, సుజిత్, బంటీ, ఆశా వర్కర్‌లు నంగీత, యాద లక్ష్మి, పద్మావతి, సురేఖ పాల్గొన్నారు.

పనిచేయని బోర్లకు మరమ్మతులు చేయిస్తాం

చిలకలగూడ: పనిచేయని చేతిపంపులు, పవర్‌బోర్లకు తక్షణమే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. సంబంధిత అధికారులతో కలిసి గురువారం ఆమె చిలకలగూడ, కిందిబస్తీలలో పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిలకలగూడ బూస్ట్ హోటల్ వద్ద నిత్యం మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు రహదారులపై ప్రవహిస్తుందని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానికులు వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరించడంతో పాటు నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు పలు ప్రాంతాల్లో పాడైన చేతిపంపులు, పవర్ బోర్లకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. పాడైన పవర్‌బోర్ల వివరాలను తనకు అందించాలని కోరారు. కార్పొరేటర్ వెంట జలమండలి అధికారి అన్విత్, పవర్‌బోర్ల మేనేజర్ వరుణ, బస్తీ నాయకులు పాల్గొన్నారు.

సినీ పరిశ్రమలో అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించాలి

● ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: హాలీవుడ్‌లో ఏ విధంగా అన్ని వర్గాలకు అవకాశాలు ఉన్నట్లుగానే తెలుగు సినీ పరిశ్రమలో అన్ని వర్గాలకు అవకాశాలు కల్పించినప్పుడే ఆస్కార్ స్ఫూర్తి తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉంటుందని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ సినిమా నాటు నాటు పాట, ఏనుగులపై చిత్రీకరించిన డాక్యుమెంటరీ ఫిలింకు ఆస్కార్ దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. కానీ తెలుగు సినిమా పరిశ్రమ కేవలం ఆధిపత్య, సంపన్న వర్గాల చేతుల్లో నలిగిపోతుందని ఆరోపించారు. ఆదివాసి పోరాట యోధులైన కొమురం భీం, అల్లూరి సీతారామరాజు వారి స్ఫూర్తితో తీసిన సినిమా కోట్లు సంపాదించడమే కాకుండా ఆస్కార్ అవార్డును సైతం సొంతం చేసుకుందని కాని.. ఆదివాసి, దళిత, ఓబీసీ, మైనార్టీ వర్గాల నుంచి తెలుగు సినిమా పరిశ్రమలో హీరో హీరోయిన్లుగా లేరని ఇది ఆ వర్గాల పట్ల వివక్ష కాదా అని ప్రశ్నించారు. భవిష్యత్‌లోనూ ఇలానే కొనసాగితే బహుజన వర్గాలందరూ సినిమాలను చూడటం మానేస్తే సినిమా ఇండస్ట్రీ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.

నెమలిని కాపాడిన ఆర్‌పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్: రైలు ఢీకొట్టి గాయపడిన నెమలిని రైల్వే రక్షకదళం పోలీసులు రక్షించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని చెట్ల పొదల్లోంచి ఒక నెమలి ఎగురుతూ రైల్వే ట్రాక్ దాటే ప్రయత్నం చేస్తుండగా అప్పుడే వచ్చిన రైలు ఇంజిన్ నెమలిని ఢీ కొట్టింది. గాయపడిన నెమలిని రైల్వే రక్షకదళం ఎస్ఐ సుబ్బారావు సిబ్బంది ప్రాథమిక చికిత్స చేయించి హైదరాబాద్ రేంజ్ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా జూ పార్క్‌కు తరలించినట్టు ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చిలకలగూడ: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్ వివరాల ప్రకారం.. పార్శిగుట్ట సంజీవపురంకు చెందిన అనీల్‌కుమార్ (35) ఈ నెల 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సన్నిహితులు, బంధువుతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తల్లి సత్తెమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బైక్ ఢీకొని వృద్ధుడు మృతి



లాలాపేట: ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రమేష్ నాయక్ వివరాల ప్రకారం.. ఓయూ క్యాంపస్‌లోని ఎన్ఆర్ఎస్‌హెచ్ హాస్టల్‌లో వార్డుబాయ్‌గా పని చేస్తున్న మహ్మద్ అబ్దుల్ మోసిన్ (64) తార్నాకలో టీ తాగి వచ్చే క్రమంలో రహదారిని దాటుతుండగా వేగంగా వస్తున్న పల్సర్ బైక్ ఢీకొట్టడంతో మోహిన్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పరిహారం చెల్లించాలి..

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓయూ హాస్టల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అబ్దుల్ మోసిన్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు ఎస్ఎల్ పద్మ డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ చట్టాల ప్రకారం బెనిఫిట్స్‌తో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పింఛన్ ఇవ్వాలన్నారు.

ఇద్దరు పాత నేరస్తుల రిమాండ్



సూర్యఅనీల్, రవికుమార్

చిలకలగూడ: మద్యంమత్తులో పడుకున్న ఓ వ్యక్తి నుంచి బంగారు గొలుసు, నగదు తస్కరించిన పాత నేరస్తులను రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ వివరాల ప్రకారం.. రాంనగర్ ఫిష్‌మార్కెట్ ప్రాంతానికి చెందిన జనార్దన్ (34) ఈ నెల 14న పార్శిగుట్ట తుల్జాభవానీ వైన్‌షాప్‌లో మద్యం తాగి అక్కడే పడుకున్నాడు. కాసేపటి తర్వాత చూసుకోగా మెడలోని బంగారు గొలుసు, జేబులోని రూ.8 వేల నగదు లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించిన పోలీసులు న్యూఅశోక్‌నగర్‌కు చెందిన సూర్యఅనీల్ (23), పార్శిగుట్టకు చెందిన కొప్పుల రవికుమార్ అలియాస్ సంజు అలియాస్ బేటా (24)గా గుర్తించారు. వారి నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. 2021లో కొప్పుల రవికుమార్‌పై పీడీయాక్టు నమోదు చేసి జైలుకు తరలించినా మార్పు రాలేదని పోలీసులు తెలిపారు. ఉప్పల్ మేడిపల్లికి చెందిన సూర్యఅనీల్ కూడా పలు స్టేషన్ల పరిధుల్లో జరిగిన చోరీ, దొంగతనం కేసుల్లోనూ నిందితుడు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణను ఈస్ట్ జోన్ చిలకలగూడ ఏసీపీ శ్రీనివాసరావు అభినందించి రివార్డులు అందించారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తికి..

రసూల్‌పురా: భోజనం పార్సిల్ చేసే విషయంలో వినియోగదారుడిపై హోటల్ నిర్వాహకుడు కత్తితో దాడి చేసిన ఘటన బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవికుమార్ వివరాల ప్రకారం.. న్యూబోయిన్‌పల్లి చిన్నతోకట్టకు చెందిన బంగారి శ్రీకాంత్ ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 15న భోజనం తెచ్చుకునేందుకు స్థానికంగా ఉన్న అమోఘ్ ఫుడ్ కోర్టుకు వెళ్లి భోజనం పార్సిల్ ఆర్డర్ చేశాడు. డబ్బులు చెల్లించిన అనంతరం కూరలు తక్కువగా ఉన్న విషయమై శ్రీకాంత్ నిర్వాహకుడు సాయికుమార్ నడుమ వాగ్వాదం చోటు చేసుకోగా సాయికుమార్ అందుబాటులో ఉన్న కూరగాయలు కోసే కత్తితో శ్రీకాంత్ తలపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాయికుమార్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసుకున్న పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు.

చోరీ చేసిన పని మనిషికి..



నిందితురాలు సునీత

చిలకలగూడ: బంగారు ఆభరణాలు చోరీ చేసిన పని మనిషిని రిమాండ్‌కు తరలించారు. పద్మారావునగర్ బలరా మ్ కాంపౌండ్‌కు చెందిన శ్రీప్రకాశ్ రైల్వే రిటైర్డ్ ఉద్యోగి. రాత్రి నిద్రపోయే ముందు మెడలోని బంగారు చైన్, చేతి ఉంగరాలు తీసి దిండు కింద పెట్టి పడుకోవడం అలవాటు. ఈ నెల 14న ఉదయం లేచి చూసే సరికి బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఇంటి పనిమనుషులే చోరీ చేసినట్లు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురు పని మనుషులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. గత రెండేళ్లుగా ఇంట్లో పనిచేస్తున్న సత్తుల సునీత (38) తానే దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి



ప్రగతి భవన్ ముట్టడికి ఓయూ విద్యార్థుల ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీ లీక్ ఘటనపై గురువారం వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ లైబ్రరీ నుంచి ప్రగతి భవన్‌కు చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ర్యాలీలకు అనుమతి లేదని ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థులను అడ్డుకోగా ఇరువురి నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అక్కడే రోడ్డు పై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు ధర్నా చేపట్టారు. ట్రాఫిక్ జామ్ అవడంతో విద్యార్థులను బలవంతంగా అరెస్ట్ చేసి అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఓయూ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరినాయక్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో ఉద్యోగులతో పాటు పలువురు మంత్రుల హస్తముందని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శులను బర్తరఫ్ చేయాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో నవీన్‌యాదవ్, సంజయ్, తిరుపతి, సలీంపాషా, ప్రశాంత్, గడ్డం శ్రీను పాల్గొన్నారు.

శాస్త్రవేత్త శ్రీధర్‌కు ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



లాలాపేట: సిఎస్ఐఆర్–ఐఐసిటికి చెందిన చీఫ్ సైంటిస్టు డాక్టర్ సుందరగోపాల్ శ్రీధర్‌కు రోటరీ క్లబ్ ఆఫ్ బాంబే సీ ఫేస్ నుంచి ఒకేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. స్టార్టప్ మైత్రీ ఆక్వాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో వాతావరణ నీటి జనరేటర్ మేఘదూత్‌ని ఆవిష్కరించారు. ఇందుకుగాను ఇటీవల బాంబేలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. శ్రీధర్ గత 25 సంవత్సరాల్లో భూగర్భ జలాల ఫ్లోరైడ్, ఉపరితల నీటి శుద్ధీకరణ, వరద ప్రతిస్పందన, పారిశ్రామిక, ఫోర్టిఫైడ్ ప్యాకేజ్డ్ డ్రికింగ్ వాటర్ తదితర రంగాలలో విశేషమైన పరిశోధనలు చేశారు.